కథానిక

# శకారుడి తమ్ముడు

ఊటుకూరు రంగారావు

ఈ జగత్తులో, ఒకో మనిషి ఒకో వింతనైజాన్ని కలిగి వుంటారు. నైజాల్లో భిన్నత్వంలేనిదే ప్రపంచంలేదు. ఒక్కోసారి ఆ భిన్నత్వంలోనే ఏకత్వం కనపడుతుంటుంది. కాని, కదాచిత్. కొందరి మనస్తత్వాలకి కొన్నికొన్ని వెర్రిఆప్యాయతలుంటాయి. వాటిని వదిలి, వాళ్ళు జీవించలేరేమోననిపిస్తుంది. కొందరికి అదేపనిగా గప్పాలు దంచడం యిష్టమైతే, ఇంకొకరికి తమనుగురించి పదిమందీ చెప్పుకోవడాన్ని వాంఛిస్తారు. కొంతమంది వూరికేనే ప్రతివాణ్ణీ తిట్టిపోయడం సరదాగా భావిస్తే, ఇంకో ప్రబుద్ధుడికి అందమైన అమ్మాయల్ని నడిదారిలో ఏడిపించి, పరాభవించడం ఆప్యాయత. ఇలాచెప్పుకోవలసివస్తే వీటిని "ఎడిట్" చేసి రాయడానికి మళ్ళీ అక్కన్నగారొకడు పుట్టుకురావాలి. పైరకం తత్వాలుగల మనుష్యులు, అప్పుడప్పుడు తమతమ నైజాలవల్ల పరాభవంపాలై తలలు వంచుకునే పరిస్థితివచ్చినా మళ్ళీ అదే నైజాన్ని చూపెడుతూంటారు. వాళ్ళకది తమ ఆస్తిత్వ నిదర్శనమేమో...?

విశ్వనాథానిది పైవింతరాకాల్లో కలిసిపోయే ఒక మనస్తత్వమే. వాడు మొదటగా పరిచయం అయినప్పుడు నాకిదంతా ఏం తెలుసు? వాడు చెప్పిందల్లా అతి సహనంతో వినేవాణ్ణి. నేను కొత్తగా ఆ వీధిలో ఒక రూమ్ అద్దెకి తీసుకోవడమువల్లనూ, ఎవరూ అంతగా పరిచయంలేనందువల్లనూ తీరుబాటున్నప్పుడల్లా వాడితో బాతాఖానీ వేసేవాణ్ణి. రానురాను మా పరిచయం అభివృద్ధి కాజొచ్చింది. వాడికి కూడా ఇతరత్రా వ్యాపకాలేమీ లేనట్లుంది వీలున్నప్పుడల్లా నన్ను కలుసుకునేవాడు.

విశ్వనాథం అన్నగారు కొత్తగా ఇక్కడికి ట్రేన్స్ఫరై వచ్చిన ఒక పోలీసాఫీసర్. ఇప్పుడిప్పుడే వూళ్ళోపలుకుబడి సంపాదించుకుంటున్న మనిషి. విశ్వనాథం స్కూల్ ఫైనల్ యాత్రలో రెండుసార్లు కాలుజారి కిందబడి, ఇక నడవలేక తిరిగి కొంపకి చేరుకున్నాడని ఒకనాడు వాడి ముఖతానే వినడం జరిగింది. ఐనప్పటికీ తనను గురించీ, తన తెలివిని గురించీ వాడు చెప్పుకునే పద్ధతిచూస్తే బహువింతగా వుంటుంది. తమ యింట్లో బొచ్చెడంత డబ్బు మూలుగుతున్నదనీ, చదువులేకున్నా ఉద్యోగం లేకున్నా తనకేమీ ఫరవాలేదనీ అనేవాడు. ఇంగ్లీషులో జనరల్‌గా తన అన్నగారికంటే తనకే పాండిత్యం జాస్తి అనీ, ఏదో దురదృష్టవశాత్తు తన తెలివి పరీక్షలకి అక్కరకు రాకపోయినంతమాత్రాన తను దద్దమ్మనుకానని నిరూపించుకోవడానికి తంటాలు పడేవాడు. అన్నిటినీ నేను ఓపికతో వింటూ, "అలాగా?" అంటూండేవాణ్ణి. వాడి వాగ్ధోరణికి బ్రేక్ వేసే మాటుంటే ఎక్కడ ఉక్కిరిబిక్కిరవుతాడో అని నాభయం. కొనికొన్ని కోతలే అయినా బలే గమ్మత్తుగా వుండేవి.

ఆవాళ సెలవు. ఎటువెళ్దామన్నా చిరాగ్గా వుంది. కొంచెం అలా లైబ్రరీకి వెళ్ళివద్దామని బయలుదేరబోతుంటే గుమ్మంలో విశ్వనాథం ప్రత్యక్షమై, "ఏటో ప్రయాణమయ్యారేమండోయ్?" అన్నాడు.

"ఆఁ, ఏమీ తోచక, అలా కొంచెం పేపర్లు తిరగేద్దామని లైబ్రరీకెడుతున్నాను" అన్నాను నేను. విశ్వనాథం భూమికేసి చూస్తూ ప్యాంటు జేబులో రెండుచేతులూపెట్టి, ఏదో క్షణకాలం ఆలోచించాడు. "అలానైతే, చికాకుపోవాలంటే సినిమాయే శరణ్యం...నేను సినిమాకి వెళ్ళాలనుకుంటున్నాను. సరదాగా కలిసివెళదాం రండి!" అన్నాడు.

వాడితో సినిమా షికారుకొట్టి, వాడి పర్సుని కొల్లగొట్టడం నాకు అంత బావుండలేదు. పోనీ నావద్దనైనా ఇవాళ దమ్మిడీలేదు. రేపటికి బియ్యం కోసం వుంచుకున్న రూపాయితప్ప. ఏదో అలా

నామమాత్రంగా, పుట్టినందుకు బతకడం తప్పని సరిగా భావించి, గాలి తిని బ్రతుకుతున్నట్టుండే బ్రహ్మచారిగాణ్ణి నేను. అదీగాక, ఈ మొగమాటాలూ, బెడదలకీ అతిదూరస్థుణ్ణి. ఏం చేయను? నసుగుతూ "అబ్బే! అవసరంలేదోయ్! డబ్బు దండగ" అన్నాను. వాడింకా నామీద ద్విగుణీకృతమైన ఒత్తిడిచేస్తూ "మనిద్దరం కలిసి ఎన్నడూ వెళ్ళలేదుకదండీ! ఇవాళ ష్యూర్‌గా వెళ్ళి తీరాల్సిందే" నన్నాడు...వదల్లేదు. గత్యంతరంలేక, నేను నా వ్యవహారం బయటపెట్టక తప్పలేదు. "ప్రస్తుతం సినిమాకు ఇద్దరికీ కాదు ఒక్కడికికూడా సరిపోయేంత డబ్బులేదు నాదగ్గర" అన్నాను చిన్నగా.

ఈ మాటతో వాడు నన్నొక అడివిమృగంలా చూసి, పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వుతూ...

"ఓయ్ పరమ భాగవతోత్తమా! ఎంత పిసినిగొట్టు మానవులు మీరు?" అని పరిహాసంచేశాడు. నేను నిజంగానే సిగ్గుపడిపోయాను. వాడు నా వాలకం కనిపెట్టి మళ్ళీ, కొంచెం హుషారుగా

"సారీ! క్షమించండి! అదా మీ సంశయ కారణం? సరే నేనే తీసికెళ్ళతాను రండి!" అన్నాడు. నేనేమీ మాట్లాడలేదు. మళ్ళీ వాడే కల్పించుకుని "షో: టైంలేదు జల్దీ!" అంటూ హెచ్చరించాడు.

వెళ్ళడమా వెళ్ళకపోవడమా అన్న 'డైలమా'లో పడి నేను తన్నుకుంటూంటే "ఐతేదేనికి వెడదాం చెప్పండి" అని ప్రశ్నించాడు. ఇక నేనేంచేయను? వాడి ఆహ్వానాన్ని అంగీకరించి "నీయిష్టం" అన్నాను.

దివిటీ చమురు నాది కానప్పుడు తెల్లవార్లూ భాగోతం ఆడుకుంటేమాత్రం నాకేం ప్రమాదం? అనుకున్నాను.

"నాయిల్లు" చాలా చక్కగా వుందట, నాగయ్య డైరెక్షన్, యాక్షన్" అన్నాడు విశ్వనాథం.

"నాయిల్లు నేనిదివరకు వరంగల్‌లో చూశానోయ్! "ఆదర్శం" చూద్దాం. అది మన నైజాం వాళ్ళ పిక్చరని వినికిడి" అన్నాను నేను...దీని మీద వాడు కొంచెం గుణిశాడు. సరే, ఊరికే వెళ్ళి చూసే ధీరుడికి ఈ బెడదంతా ఎందుకు ఏదో ఒకటి చూడక" అనుకుని అంగీకరించి బయల్దేరాం సినిమాగృహం వెదుక్కుంటూ.

"ఫస్టుషో" మొదలవడాని కింకో పావుగంట టైంవుంది. అంతా హడావిడిగావుంది బుకింగ్ కంత దగ్గర. ఆ జనసమూహాన్ని చూస్తూ "హఠాత్తుగా జ్ఞాపకం వచ్చిన ఒక గీతిక చరణాన్ని పాడుకుంటున్నాను." జనసముద్రం పొంగి మనని ముంచేస్తుంది.

జనులార! ఘనులార! ధన మహీపతులార!" అని.

ఈ జనసమూహం, తరంగాల్లా వెల్లుబికివచ్చే వీళ్ళ ఆనందం నాకు విచిత్రంగా వుంది. ఇంత మందిలో వుండికూడా నేను భయంకరమైన ఒంటరితనంలో నేవున్నట్టు ఊహ కందుతోంది. వీళ్ళకున్న ఆనందంలో ఈ ఉత్సాహంలో కనీసం ఆరవయ్యోపాలు నాలోవున్నా, నా యౌవన జీవితరాత్రులు ఇలా వృధాకాక, జీవితంలోగల స్వచ్ఛతా మధు రిమల్ని కనుగొనే వాణ్ణే" ననే అభిప్రాయంతో నేను అసమర్థుడి వేదాంతంలో పడిపోయి అలానే ఐదునిమిషాలాలోచించి తెప్పరిల్లి చూచేవరకు, మా విశ్వనాథం బుకింగ్ కిటికీముందు ఠీవిగా పచార్లు చేస్తున్నాడు. "ఏమోయ్ టైంమైంది, టికెట్స్ కొన్నావా?" అని ప్రశ్నించాను.

"లేదు" అని వాడి సమాధానం.

"అరే! మళ్ళీ బుకింగ్ బందవుతుంది" అన్నాన్నేను. కొంప మునిగినంత ఆదుర్దాతో అన్న నాయీమాటలు నాకే సిగ్గనిపించాయి. విశ్వనాథం చిరునవ్వుతూ,

"మనకు బుకింగ్‌తో పనేమిటండీ!" అన్నాడు నిర్లక్ష్యంగా.

నాకిదంతా ఏదోమాదిరిగా వుంది. "మరెలా మన వ్యవహారం?" అన్నాను. వాడు ధీమాగా తల తిప్పుతూ, "మా బ్రదర్ ఉద్యోగం సంగతి మీరు మరిచిపోతున్నట్టుంది. మనదంతా ఫ్రీ వ్యవహారం" అన్నాడు. నాకేమనడానికీ నోరు పెగల్లేదు. హాయిగా టికెట్టు కొనిచూడడంలో వున్న తృప్తి, పదిమందివెంట పడి గాపులుపడి చూడటంలో వుండదు. ఇంతదూరం వచ్చాక వెళ్ళిపోవడం అసలే బావుండదు. పోనీ టికెట్టు

ఒకటి నావరకన్నా తీసుకుందామా అని చూస్తే బుకింగ్ బందయిపోయింది. హాలు నిండిపోయింది. బోలెడుమంది వాపస్ వెళ్ళిపోతున్నారు. నాకు బలే చికాకనిపించింది.

ఫస్టుబెల్ అయింది. మా విశ్వనాథం నన్నక్కడే నిల్చోమని చెప్పి, తిన్నగా ఫస్టుక్లాస్ గేట్ దగ్గరికి వెళ్ళాడు. ఆ గేట్‌కీపర్ గాడితో వీడు మాట్లాడేమాటలు నాకు సరిగా వినపళ్ళేదు. కాని, కాస్సేపయాక పెద్దగా చాటించినట్టుగా అనే గేటువాడి మాటలుమాత్రం చక్కగా వినపడ్డాయి. "వీల్లేదండీ! మొదటి మూడురోజులూ ఫ్రీ పాసులూ, కాంప్లిమెంటరీలూ చెల్లవు" అంటూ.

నాగుండె గతుక్కుమంది. "ఆరిదేవుడా! నాకిదేం గతిరా" అనుకుంటూండగానే విశ్వనాథం దేబెముఖం వేసుకుని నాదగ్గరకివచ్చాడు. వస్తూనే "మా బ్రదర్ ఈ పిక్చరికి వచ్చాడటండీ! ఇప్పుడే లోపటికి వెళ్ళారని గేట్‌కీపర్ చెప్పాడు. మనం ఇలా ఆయన కంటబడటం అంత మంచిదికాదు. ఇంటివద్ద నాకోసని చెప్పివచ్చారు" అన్నాడు.

నాకు చచ్చేంత నవ్వూ ఏడుపూకూడా వచ్చింది వీడి అసమర్థతకి. గేటు కీపర్ మాటలు స్పష్టంగా నేను విననే వింటిని. ఇంకా వాడు చూడలేదేమో కాని మేం ఇటువచ్చేటప్పుడు వాళ్ళన్నయ్య క్లబ్బుగ్రౌండులో క్రికెట్ ఆడుతున్నాడు. విశ్వనాథం తన మర్యాదను కప్పిపుచ్చుకోవడానికి వేసిన ఈ ఎత్తుచూసి వాణ్ణో మనసులో అర్థంకాలేదు. ఏదన్నా అంటే చిన్నబుచ్చుకుంటాడేమోనని "ఓహో! అలాగా! ఐతే ఇంటికి వెళదాం పద!" అన్నాను. వాడి మనస్సులో తన యీ అగౌరవాన్ని నేను చూళ్ళేదని తృప్తి ఒకవైపూ, సినిమా చూపించలేకపోయానే అన్న బాధ మరోవైపూ పీడిస్తున్నట్టుంది. పట్టుదలతో "ఇంటికెందుకండీ? "ఆదర్శం"కు వెళదాం ఏదో ఒకటి, ఏమంటారు?" అన్నాడు.

నాకీ వ్యవహారం అంత నచ్చలేదు. హాయిగా లైబ్రరీకి వెళ్ళినట్టుంటే ఖులాసాగా కథలు చదువుకునేవాణ్ణే అనుకుని "ఎందుకోయ్ మళ్ళీ అంతదూరం? రేపు వెడదాం లెద్దూ" అన్నాను భారంగా. వాడు వింటేనా? విడిపోయిన గౌరవాన్ని తిరిగి పూర్తిచేసుకోవాలనుకున్నాడో యేమో బలవంతంగా నేనురానో మొర్రో అంటూంటే లాక్కుపోయాడు. వీడి పలుకుబడిని ఓ సారి చవిచూసిన నేను మళ్ళీ ఎలా నమ్మను...? అక్కడా ఇలాగే అయిందంటే?

"సింగరేణి కాలరీస్ స్పెషల్ రైలు"లా ఊగుతూ ఊగుతూ మేం అక్కడికి చేరేవరకే ఫస్టు షో మొదలయింది. విశ్వనాథం మళ్ళీ నన్నక్కడ నిలవేసి యకాయకీ రిజర్వుడు క్లాస్ వద్దకి వెళ్ళాడు. వెళ్తూనే అక్కడి గేటుకాపలా మనిషిచూసి "ఓహో! నాగదాసూ! ఏవోయ్! ఇవాళ నీదా ఈగేటు?" అని పరిచయం చేసుకున్నాడు. గేటువాడు పళ్ళికిలిస్తూ "అవును బాబూ!" అన్నాడు. విశ్వనాథం వెనక్కి తిరిగి నన్నుచూస్తూ "రండిమాస్టారూ! లోపలికెడదాం" అన్నాడు తనకేమీ ఆటంకంలేనట్టుగానే.

నాకు కొండంత సంతోషం అయింది. వాడు ఈ మారు కృతకృత్యుడయాడు గదా అని వాణ్ణి అనుసరించి లోపలికి పోబోతున్నానో లేదో, ఆ గేటు మనిషి మమ్మల్ని విచిత్రంగా చూస్తూ "మేనేజర్ గారిని అడిగిరండి బాబూ!" అన్నాడు విశ్వనాథంతో.

నా నరాలు ఈదెబ్బతో తటుక్కుమన్నాయి. విశ్వనాథం నిలువునా నీరైపోయాడు, సంబాళించుకొని "ఫరవాలేదోయ్! ఫలానివారి తమ్ముడని నీవువెళ్ళి చెప్పు మేనేజరుతో, మేం లోపల కూర్చుంటాం" అన్నాడు. ఆ మైరావణుడు తల అడ్డంగా వూపుతూ "అమ్మో! నే వెళ్ళను. గేటు వదిలిపెడితినా ఉద్యోగం దుమ్మే, మీరే వెళ్ళి చెప్పించండి!" అన్నాడు. విశ్వనాథం ఈ మారు ప్రత్యక్షంగా నా ముందు జరిగిన ఈ పరాభవాన్ని సహించడక ఆవేశంతో వచ్చిన కోపం ప్రస్ఫుటించేట్టుగా "ఎవడోయ్! ఆ మేనేజరూ? కొత్తవాడా, పాతవాడా? ఏదీ ఇలా రమ్మను చూతాం... వెళ్లి చెప్పుకో ఫో!" అంటూ "రండి మాస్టారూ! లోపలికి" అని నాచేయి లాగుతూ ఒకడుగు ముందుకువేశాడు. గేటువాడు కళ్ళు చికిలిస్తూ "ఏమండోయ్! మీకేచెప్పేది. వెళ్ళిపొండి!" అని కఱ్ఱనడ్డం పెట్టేశాడు గేటుకి.

విశ్వనాథం క్రోధం ఉన్మత్తదశలో పడుతూన్నది. "ఫూల్! తొలుగు" అన్నాడు. గేటువాడు నిర్లక్ష్యంగా "పోవయ్యా! నేను మర్యా

దగా మాట్లాడుతుంటే నీవు అలా మాట్లాడతావేం? జాగ్రత్త!" అన్నాడు.

ఈసారి విశ్వనాథంకోపం మాంచిక్లైమాక్స్ కి వచ్చేసింది. ఆపుకోలేక "బద్మాష్" అని పెద్దగా అరిచి అమాంతం వాడిమీదదూకి పెద్దపులిలా వాడిమెడ పట్టేశాడు. వాడూ బక్క ఘటం కాదేమో...విశ్వనాథం మెడని అంతకంటే బలీయంగా నొక్కి పట్టాడు. ఇద్దరూ గింజుకుంటున్నారు. నాకు భూమ్మీద కాళ్ళానడం లేదు. ఏదీ ఆలోచించుకునే తీరికాలేదు. చప్పున వెళ్ళి ఇద్దర్నీ విడదీయబోవడంలో ఎవడిదోగాని నా నెత్తిన భీమగదాఘాతంలాంటి పిడిగుద్దు పడింది. దిమ్మతిరిగిపోయింది. కాని ఎలాగో ఓర్చుకుని వాళ్ళని విడదీయగలిగాను. విశ్వనాథాన్ని కొంచెం ఇవతలికి లాగినిలేశాను. మాచుట్టూ జనంపోగయింది. అంతా గంద్రగోళం...ఇంతలో "సినిమా తెడకిలూ కుర్చీలూ అన్నీ ఎవరో బద్దలు కొడుతున్నారట, అవతల కొట్లాడ జరుగుతోంది బ్రహ్మాండంగా," అని సినిమాహాల్లోంచి ఎవడో కేకేశాడు. వుత్తిదే, ఇంకేముంది. హాల్లో జనం ఒక్కసారి విరుచుకపడిలేచి బయటికి పొర్లింది. ప్రతివాడూ, ఏం జరిగిందని ఎదటివాణ్ణి ప్రశ్నించడమేగాని సరైన జవాబు లేకపోయింది. ఇదంతా నాకు భయం, ఆశ్చర్యం, కోపాలనుకూడా కలిగించింది. వెళ్ళిపోదామన్నా సందు దొరకని పరిస్థితివచ్చింది. జనం కొంతమంది మిమ్మల్ని వింతగా చూస్తూంటే ఎక్కణ్ణించి వచ్చాడో మా గుంపులో జొరబడి, మాముందు నిలబడ్డాడు మేనేజరు. నిలబడడంతోనే నన్ను గుర్తుపట్టి, ఆశ్చర్యంగా చూస్తూ "అరే! మీరా? ఇలావచ్చారేం...? మీరేనా గోలచేసి గేటువాణ్ణి తన్నింది? విచిత్రమే..." అన్నాడు. నాతల భూమిలోకి దించుకపోయింది. ఏంచేయను? ఆ సినిమా మేనేజరు మా క్లబ్బు మెంబరు నాకు పరిచితుడు. నేను క్లబ్బు మేనేజరుగా పనిచేస్తూ, మెంబర్లందరిలోనూ కొద్దికొద్దిగా గౌరవాన్ని సంపాదించుకుంటూన్నవాణ్ణి. ఇక మాట్లాడలేక, విశ్వనాథంవైపు వేలు చూపించాను. సినిమా మేనేజరు విశ్వనాథాన్ని చూసి, అంతా నిముషంలో గ్రహించాడల్లే వుంది.

"మిష్టర్! ఇది రెండోసారి మీ మీద ఇలాంటి నేరాలు మోపబడటం ఇదేమంత మర్యాద కాదు మీకు. విధిలేక మీ అన్నగారితో చెప్పాల్సి వస్తుదిక" అన్నాడు చిరాకుగా... విశ్వనాథం ఏంచేస్తాడు...? నా ముందు వాడికిప్పుడు ఘోర పరాభవం జరిగింది. ఏదో ఆలోచిస్తున్నాడు తెంపులేకుండా. మేనేజరు మళ్ళీ వాణ్ణి ఏమీ ప్రశ్నించకుండానే నావేపు తిరిగి.

"రావ్ జీ! ఈయనతో వచ్చారేం మీరు? ఇవాళ మా ప్రొప్రయిటర్ గారి పుత్రోత్సవ సందర్భంగా మన వాళ్ళందరికీ కాంప్లిమెంటరీలు పంపామే" అన్నాడు.

"నాకు అందలేదండీ! ఏదో కులాసాగా తిరుగుదామని బయల్దేరితే ఇలా అయింది, క్షమించండి!" అన్నాను నేను.

"ప్యూన్ కి మీయిల్లు తెలీదేమో, క్లబ్బులో వేసివుడవచ్చు"నన్నాడు మేనేజరే. అవునేమో అన్నాను. "సరే, పదండి హాయిగా పిక్చర్ చూదాం" అన్నాడు.

"క్షమించండి! నేను రానిప్పుడు."

"ఏం? రాకపోవడమేమిటి?" అన్నాడాశ్చర్యంగా. "మళ్ళీ రేపు క్లబ్బులో కలయండి చెబుతాను" అని అంటూ, ఇక జవాబుకు యెదురు చూడకుండానే విశ్వనాథాన్ని తీసుకుని జనంలోంచి బయటపడ్డాను. మేనేజర్ కిదేమీ అర్థం కాక గడ్డం తేలవేసి చూస్తుంటే బతుకుజీవుడా అని రాజవీధిలో నడుస్తున్నాం.

పాపం! విశ్వనాథం పరిస్థితి అతి దుర్భరంగా వుంది. వాడి మనస్సులో ఎన్ని నిప్పులు తుపానులు లేస్తూన్నాయో చెప్పలేము. వాణ్ణి చూస్తే నాకు జాలీ నవ్వూ కూడా కలుగుతున్నాయి. కొంతదూరం ఇంటిముఖంపట్టి నడిచాక, పెదవులు కదిలిస్తూ విశ్వనాథం, "వెధవ! మీరుగనక అడ్డం రాకుండావుంటే ఆ గేటువాణ్ణివాళ చావదన్ని వదిలేవాణ్ణే" అన్నాడు.

వందలమంది ముందువాడికంటే ఎక్కువగా శిరస్సును కిందికిదించుకున్న నా అవమానం, ఈ మాటతో ఎగిరిపోయి, పొట్ట చెక్కలయ్యేంత నవ్వొచ్చింది...విపరీతంగా నవ్వాను.

విశ్వనాథం దిగులుపడి చూస్తున్నాడు.